# చిగిర్చిన విధుర జీవితం

పెనుమర్తి కామేశ్వరరావు

వెంకట్రావు వెనకటి సంగతులు జ్ఞప్తికి తెచ్చుకొని తృప్తిపడేవాడు. అలభ్య వస్తువులకోసం అంతరంగంలో శాంతిని కోల్పోక, గతానుభవాల్ని మదిలో కదిలించుకొని తన మనస్థితిని కుదుట పరుచుకునేవాడు. అతని దురదృష్టానికి భూతకాలానుభూతి ఒక కవచం లాగున యేర్పడింది. అందువలన అతనికి భవిష్యత్తులో ఏమి విపత్తు సంభవిస్తుందో అను భయంగాని, అయ్యో! ఈ అనుభవం అందకుండా చేతిలో పక్షి ఎగిరి పోయినట్లుగా అదృశ్యమైందని విచారంగాని లేదు. ప్రతిదినం అతనికెన్నో కోరిక లీరిక లెత్తేవి. కాని అతను వాటికి సమాధానం మనసులో కూర్చుకొనేవాడు. ఆ కోరికలన్నీ ఉపశమించేవి. అతనికి బాధలేకుండా గాఢసుషుప్తి కలిగేది.

సంతత నిరస్త వాంఛలతో అతనిలో వైరాగ్య భావంకూడ కలిగింది. అనుభూతులు దూరమైనప్పుడు, ప్రయత్నాలు విఫలమైనప్పుడు, దాని సద్యఃఫలితము విరాగమే! ఈ విరాగానికి తోడుగా అతను వెనకటి సంగతి సంగతులు జ్ఞప్తికి తెప్పించుకొని, వేదనను సులభంగా నిగ్రహించడం నేర్చుకున్నాడు.

వెంకట్రావు స్వర్గచ్యుత నహుషుడంటే సరిపోదు. యౌవన వసంతంలో అన్ని రంగాలలో పొంగి పొరలు సముద్రతరంగములవంటి కాంక్షల్ని పొందాడు. మనసు వెగటు కలిగేటంతగా పొందక పోయినా, ఏది ఏమిటో రుచిచూచి తెలుసుకున్నాడు.

అతను స్కూలు ఫైనల్ పరీక్ష పాసయే నాటికే అతని చేతిలోకి ఆస్తిమీద పెత్తనం వచ్చింది. కొత్తగా లభించిన పెత్తనంలో అతను ప్రతి నూతనానుభవం కోసం ప్రయత్నించి, అందులో సఫలీ కృతుడై, అతికి దూరంగా వుంటూ, తన ఆర్థిక స్థితిని నాశనం చేసుకోలేదు. బంధువులు వద్దంటున్నా అతను కాలేజీలో చదవడాని కుద్యుక్తుడైనాడు. మూడు మాసాలు చదివే సరికి అతనికి కాలేజీ చదువూ అందులోని విశిష్టత అర్థమైంది. యువకులు యువతులు కలిసి చదువుకునే కాలేజీ వాతావరణంలో, అనేకమంది యువకులకు కలిగే కలలు అతన్నీ బాధించినాయి. కొద్దికాలంలో అనగా రెండు సంవత్సరాలలో యువకులు అర్థం చేసుకొని జీర్ణించుకోడానికి వీలులేనన్ని విషయాలు బోధించే కాలేజీ చదువు అతని మనసును గందరగోళ పరిచింది. ఆ చదివిన మూడుమాసాలలో లాజిక్ అతనికి అంతే పట్టలేదు. ఇక ఇంగ్లీషు ఉపన్యాసకుల ధోరణి - అది పిల్లలకోసం కాదని తెలుసుకున్నాడు. యువతులు, యువకులు అన్యోన్యాకర్షణాబాధితులై, ప్రణయవేదనా మనస్కులై దినదినము చదువు మీదకంటే, సౌందర్య పోషణమీద ఎక్కువ శ్రద్ధ వహించడం గమనించాడు. కాలేజీ చదువు స్వర్గతుల్యమైనదని భావించే కుర్రవాళ్లతో ఏకీభవించలేకపోయాడు.

ప్రతిమాసం ఎవరూ తనకు డబ్బు పంపే వాళ్లులేరు. తానే తన జీవితంమీద పెత్తనదారు! తల్లిదండ్రులు పంపే ధనమైతే, అతనూ కాలేజీ చదువనే మిషతో దానిని దుర్వ్యయం చేస్తూ జల్సాగా తిరిగేవాడే! కాని, అతను తనంతట తాను చదువు నిమిత్తం ధనం సేకరించి చదువుకొనటం వలన కాలేజీ చదువుకీ, తనకున్న ఆదర్శాలకీ ఎక్కడా సమన్వయం కుదరదని, మూడు మాసాలలోనే గ్రహించి అది విరమించాడు. కాలేజీలో అన్ని సబ్జక్టులు రుచి చూడటమే గాని, ఏ ఒక్క విషయంలోనూ పరిపూర్ణ విజ్ఞానం కలిగే అవకాశం లేదని తెలుసుకున్నాడు వెంకట్రావు. అతనికి పదిహేనో ఏటినుంచి ఆంధ్ర సాహిత్యం మీద అపారాదరాభిమానాలుండడం వలన, కాలేజీ

చదువులో అది త్వరితకాలంలో ఫలించబోదని తెలుసుకున్నాడు. అతనికి జీవనోపాధికి తగిన ఆస్తి వుంటం వలన, డిగ్రీ సంపాదించి ఉద్యోగము చేయాలన్న ఉత్సాహంలేదు.

వెంకట్రావు తనవంశ నశేషం! అతనికి ఒక అక్కగారుతప్ప ఇంకెవరూ లేరు. పెదతండ్రులు, అన్నలు, తమ్ములు ఎవరూ లేనందున జీవిత సమస్యల్ని పరిష్కరించుకొనే విషయంలో అతని మనస్సే అతనికి వెలుగు చూపించేది. ఉన్న అక్కగారు దూరదేశంలో వుండి ఉత్తరాల ద్వారా సలహాలు కురిపించేది. కాని, ఆడవాళ్ల సలహాలకతను విలువనిచ్చేవాడు కాడు! అక్కగారు తన లేఖల్లో "నువ్వు బి. ఏ, ప్యాసయి, వివాహం చేసికొని, ఉద్యోగస్థుడివై, సంతానవంతుడివై పదికాలాలపాటు వర్ధిల్లాలని నా కోరిక. నీ చిన్నతనంలోనే అమ్మా, నాన్నా గతించారు. ఉన్న నేనుకూడా నిన్నాదుకునే స్థితిలో లేనందుకువిచారపడుతుంటానుమనవంశానికి మిగిలింది నీవొకడివే! నీకు మంచి, చెడు, చెప్పేవాళ్లెవరూ లేరు! మేనమామలున్నారంటే వాళ్లుకొరకబడని కొయ్యలు. వాళ్లు నీవిషయమే పట్టించుకోటం లేదని తెలిసి చాలా విచారపడ్డాను. నువు కాలేజీలో ప్రవేశించి మూడు మాసాలకే మానుకొనడానికి కారణమేమిటి? డబ్బు కిబ్బందిగా వున్నదా? పొలంలో వచ్చే డబ్బేమి చేస్తున్నావు? దుర్వ్యయం చేస్తున్నావని నేనూహిస్తున్నాను. నీవు బాగుపడదలిస్తే మాదగ్గరకు రావడం మంచిది" అని వ్రాసింది. కాని వెంకట్రావు బంధువులకు దూరంగా వుండటమే మంచిదని నిశ్చయించుకున్నాడు.

డిగ్రీ లేకపోయినా, ఉద్యోగం లేకపోయినా, ఆస్తి వుంది కాబట్టి అతనికి వివాహమైంది. అతని వివాహానికి వచ్చినప్పుడతని అక్కగారతనివల్ల అన్నివిషయాలు తెలుసుకొని, అతని ఆదర్శానికి ప్రోత్సాహకరంగా మాట్లాడలేదు.

"వంద ఎకరాల ఆస్తి వున్నవాళ్లుకూడా పరీక్షలు పాసయి, ఉద్యోగాలుచేసి వందలు సంపాదిస్తున్నారు. నా కుద్యోగ మక్కరలేదన్నవాడివి నీ వొక్కడివి మాత్రం కన్పిస్తున్నావు. కాలేజీ చదువు డబ్బు దండుగని మానేశావు. కొత్త టైపు, షార్టుహాండు నేర్చుకుని ఆ పరీక్షలు పాసయావంటే ప్రభుత్వంలో ఉద్యోగం వస్తుందని మీ బావ అన్నారు." అన్నది.

"నాకే ఉద్యోగం అక్కరలేదు. నా ఆదర్శానికి ఉద్యోగం పెద్ద ఆటంకం. నా సంగతి నే నాలోచించుకోగలను." అన్నాడు వెంకట్రావు.

తమ్ముడికి మంచి ఆలోచన దైవం బోధించాల్సిందే కాని మానవులకు సాధ్యంకాదని అతని అక్క తెలుసుకుని అతనితో అతని భవిష్యత్తుగూర్చి మాట్లాడలేదు. అతని వివాహానంతరం అతని మామగారు అతను ఒంటరివాడని తెలిసి అతనికి సద్బుద్ధులు గరపాలని కొంత ప్రయత్నించకపోలేదు. ఆ ప్రయత్నం విఫలం కావడమేగాక మామ అల్లుళ్ళ కా విషయంపై విరోధం వచ్చి తత్ఫలితంగా భార్యతో మూడు సంవత్సరాలు కాపురంచేసిన మీదట అతనికి భార్యావియోగం కలిగింది. అంటే అతని భార్య పరలోకానికి పోలేదు, పుట్టింటికి వెళ్ళిపోయింది. తండ్రి పక్షాన నిలబడి భర్తతో పోరాటం తెచ్చుకుంది. తండ్రి పక్షమైన భార్యని అతను తన పక్షం చేసుకోలేకపోయాడు. ఎన్నివిధాలనో ప్రయత్నించి విఫలుడైనాడు.

భార్యావియోగంలో అతను ప్రారంభంలో విప్రలంభవేదన పొందలేక మనశ్శాంతికోసం ఉత్తర హిందూస్థానంలో పట్టణాల వెంట తిరిగాడు. బొంబాయిలో మూడు మాసాలు, అలహాబాదులో రెండుమాసాలు, కలకత్తాలో ఒక మాసం ఉండి అక్కడ గ్రంథాలయాలలో ఆంగ్ల గ్రంథాలు చదివాడు. సినిమాలు చూచాడు. విదేశీయుల టెన్నిస్ ఆటల ప్రదర్శనాలను తిలకించాడు. ఈ సందర్భంలో అతనికున్న పదిహేను ఎకరాల పొలంలో ఐదెకరాలు పరులపాలయింది. ఐనా అతను విచారపడలేదు.

ఆ పర్యటనలో అతనపారంగా ప్రపంచానుభవం గడించాడు. ఆ అనుభవం అతనికి ఎన్నో విధాల తోడ్పడింది కాని అతని కనేక విషయాలలో మిడిమిడి జ్ఞాన మేర్పడడం

చేత, ఎవరేవిషయంగూర్చి మాట్లాడినా అవతలి వాళ్ళను తన విజ్ఞానంతో అపజయుల్ని చేసి వాళ్ళకు విరోధి అయేవాడు. అతని నెరిగిన స్నేహితులు అతన్ని చూచి జాలిపడేవారు. వెంకట్రావు ధనార్జనాపరుల్ని, ఘరానా మనుషుల్ని చులకనగా చూసేవాడు. ప్రతి విషయంలో, సాహిత్యంగాని రాజకీయంగాని సినిమా గాని తన అభిప్రాయాలు నిష్పాక్షిక మని అతని అభిప్రాయం. తను ప్రతివిషయాన్నీ నిరుద్యోగిగావుండి తరిచిచూచిన సంగతి నిజమే గాని అతను తన అనుభవాల్నీ, భావాల్నీ ఇతరులు అంగీకరించి తీరాలని భావించడం అతని విజ్ఞానానికి కళంకంగానే వుండేది. వెంకట్రావు ఉద్యోగి కాకపోయినా, ఉద్యోగుల అలవాట్లుకలవాడు. అతను ఎప్పుడూ సీటుగా వుండేవాడు. అతనుండే అద్దె యింటిలో, అతని గది గోడలకు తగిలించబడిన ఫొటోలనితర లభ్యములు; అవి భావనాపూరితములు; సామాన్యుల కాచిత్రం లర్థంకావు. అవి సినిమా తారల బొమ్మలుకావు. ప్రపంచఖ్యాతి గడించిన ఫొటోగ్రాఫరులు కళాదృష్టితో తీసిన చిత్రాలవి. వాటినిగురించి వెంకట్రావు పుస్తకాలు చదివాడు. ఆ చిత్రముల భావ మాతడు తన సన్నిహితమిత్రులకు మాత్రం బోధ పరిచాడు. అతను బస్తీలో ఉద్యోగస్థుల క్లబ్బులో సభ్యుడు. అతనింట్లో ఫొటోలు చూచిన మిత్రులు వాటి గొప్పదనాన్ని క్లబ్బులో ఘరానా మనుషులకు చెప్పారు. వారిలో కొందరికి ఆ చిత్రాలు చూడాలని వాంఛ కలిగింది. ఇలా వాంఛ కలిగినవారిలో వాసుదేవరావను న్యాయవాది ఒకడు. ఒకనాడు ఉదయం ఎనిమిదిగంటలకు వాసుదేవరావు వెంకట్రావింటికా ఫొటోలు చూదామని వచ్చాడు. వెంకట్రావు దినపత్రిక చూస్తున్నాడు.

వాసుదేవరావు ఇంట్లో ప్రవేశిస్తూ "మీవద్ద వున్న చిత్రాలు చూద్దామని వచ్చాను." అన్నాడు.

"రండి చూడండి. అన్నీ గోడలకే తగిలించి వుంచాను." అన్నాడు వెంకట్రావు.

వాసుదేవరావు ఆ చిత్రాలన్నీ తదేక దృష్టితో పరికించి "ఈ ఫొటోలేమీ బాగా లేవు. ఇవి చాలా గొప్పవని మీ మిత్రులనడంలో అర్థంలేదు!" అన్నాడు.

"ఇవి న్యాయవాదుల కర్థమయే విషయాలు కావు!" అన్నాడు వెంకట్రావు కోపంగా.

వాసుదేవరావు మనసు చివుక్కుమంది. 'నా వద్ద కెమేరా వుంది. ఫొటోగ్రఫీ గూర్చి నాకా మాత్రం తెలుసు!' అన్నాడు వాసుదేవరావు.

"కెమేరా వుండి ప్రయోజనం లేదు. ఈ చిత్రాలలో గొప్పదనం మీరు తెలుసుకోవాలంటే మీరీవిషయం గూర్చి చాలా గ్రంథాలు చదవాలి. ఈ చిత్రానికి లండన్ ప్రదర్శనంలో ప్రథమ బహుమతి నిచ్చారు!" అని వెంకట్రావు ఒక చిత్రాన్ని ఆయనకు చూపాడు.

వాసుదేవరావున కాచిత్రంలో భావం అర్థం కాలేదు.

"ఆ ఫొటో నాకేమీ బావుండలేదు." అన్నాడు వాసుదేవరావు.

"అందువల్లనే యీ విషయాలు న్యాయవాదుల కర్థమయే విషయాలు కావన్నాను!" అన్నాడు వెంకట్రావు. ఇక లాభం లేదని వాసుదేవరావు అక్కడి నుంచి కోపంతో గృహోన్ముఖుడైనాడు. అతనికి వెంకట్రావు అమిత గర్వి అన్న అభిప్రాయం కలిగింది. అతడు గ్రామంలో పలుకుబడి గల న్యాయవాది. ఆస్తిపరుడు. అతనికి వెంకట్రావుకు గర్వభంగం చేయాలన్న దృఢనిశ్చయం కలిగింది.

* * *

జ్యోత్స్నా పులకిత రాత్రులలో, మేడ మీద దక్షిణభాగపు గదిలో, నీలిరంగు విద్యుద్దీపకాంతిలో, మలయదరీకుమార పవమానుడు మందముగ వీస్తుండగా, తరుణ మనోహారిణీ కుచోపగూహనంలో సుఖపడవలసిన వెంకట్రావు, కామిని లేకుండా గడుపుతుండడం అతని నెరిగిన పురుషులకేగాక స్త్రీలకు కూడా జాలిని కలిగించింది. ఆస్తీ, అందమూ, విద్యా, వుండి సంసారసౌఖ్య మనుభవించజాని కతని కదృష్టం అదృశ్యమై అతనేకాకిగా జీవించడం స్త్రీ పురుషులకు జాలి కలిగించడములో ఆశ్చర్యమేముంది? అతడేదో ఉన్నతాదర్శసాధనలో వేదనాదోదూయమాన మాన

సుడై జీవిస్తున్న సంగతి అతని మిత్రులొకరిద్దరికి మాత్రం తెలుసు.

భార్యాతిరస్కృతుడైన వెంకట్రావు నల్లరి చేయడానికి వాసుదేవరావునకొక ఉపాయం తోచింది. అతను తన మిత్రులందరికీ వెంకట్రావుకున్న గర్వం గురించి చెప్పి ఒకరొకరినే వెంకట్రావు వద్దకు పంపించసాగాడు. వాళ్లందరూ అతని కళాపూరిత చిత్రాలు చూడ్డానికి వచ్చి, "ఏమండీ! మీరు చాలా కాలంనుండీ ఒంటరిగా వుంటున్నట్లున్నారు. మీకు వివాహం కాలేదా? లేక భార్య చనిపోయిందా?" ఇత్యాది ప్రశ్నలు వేయసాగారు.

ఆ విధంగా వెంకట్రావుని ప్రశ్నించ వలసిందని వాసుదేవరావు తన మిత్రుల కాదేశించాడు. దినదినమొక క్రొత్త వ్యక్తి వచ్చి ఆ విధంగా ప్రశ్నించడం వలన వెంకట్రావుకు మానసికాందోళన హెచ్చింది. ఆ ప్రశ్నించే వారికి మొదట్లో సరియైన సమాధానమే చెప్పసాగాడు. కాని క్రమక్రమంగా ఆ అడిగే వారు అతని సమాధానం విని "మీరు మరల పెళ్ళాడరాదూ? అసలు కళాప్రియులకు భార్యలుండడం అనవసరం! కవులు, చిత్రకారులు, గాయకులు, నటులు—వీరికి కళయే అర్ధాంగి!" అని వెంకట్రావు కనీసం ఉంపుడుగత్తెనైనా ఉంచుకొనవలసిన అవసరం ధ్వనింపజేసి వెళ్ళిపోయేవారు. ఇది ఒక తుంపరవానగా ప్రారంభమై క్రమంగా గాలివానగా మారజొచ్చింది. గ్రామంలో అతని మిత్రులకూ, శత్రువులకూ అతనేకాకి అని తెలిసిపోయింది.

తనమీద కక్ష వహించిన వాసుదేవరావీ తుపానుకంతా కారకుడని తెలుసుకోలేకపోయాడు వెంకట్రావు. అపరిచితు లనేకమంది అనేకపర్యాయము లనవసరంగా తన యింటికి వచ్చి అయాచితంగా తన ప్రశాంతజీవితవాతావరణాన్ని కల్మషపరచ ప్రయత్నించడం వెంకట్రావుకు బాధాకరమైంది. సమాజంలో ఆదర్శాల కోసం, పరువు ప్రతిష్ఠలకోసం బ్రతికే తాను ఒంటరిగా వుండడం ప్రజల కేవగింపు కలిగిస్తుందని అతనెన్నడూ భావించలేదు. కళాభిరుచి గల యౌవనవతి, తన కనుకూలవతి లభిస్తే తిరిగి వివాహమాడుదామని అతని హృదయవాంఛ! పరకీయతో ప్రణయం అపకీర్తి భాజనమనీ, అది అలభ్యమనీ అతను తనను ప్రేమిస్తున్నట్లు చూచే లేతలేత కపోలవతుల మనస్థితిని గ్రహించి నిరాదరంతో సంచరించ సాగాడు.

తన ఒంటరితనం గురించి పురుషులు ప్రశ్నించడం భరించలేక అతను ఒకరిద్దరికి విరసంగా జవాబిచ్చాడు.

"ఇంతమంది వచ్చి, నా ఒంటరితనం గురించి పృచ్ఛించేవారే కాని, ఒకరూ 'మీకు మా అమ్మాయినిచ్చి పెళ్ళిచేస్తాం' అనడేమిటని నేను విచారిస్తున్నాను" అన్నాడు వెంకట్రావు ఒకనాడొకాయనతో. ఆయన ముఖం చిన్నబుచ్చుకుని "భార్య గలవాడికి పిల్లనిస్తా ననడానికి ఎవరికి ధైర్యముంటుంది లెండి! పాపం! మీవంటి యువకులు ఇలా ఒంటరిగా జీవిస్తున్నారని విని జాలి పడేవాళ్ళమే గాని, ఎవరి కర్మ నెవరు తప్పిస్తారు?" అని ఒక వేదాంతసారవచనాన్ని వదిలిపోయాడు.

తన ధనం తాను ఖర్చుపెట్టుకుంటూ, పరధన మపేక్షించక జీవయాత్ర గడుపుతున్న వెంకట్రావుమీద సమాజంలో వ్యక్తులు తమ శక్తికొలదీ విషప్రచారం సాగిస్తున్న సమయంలో, అతనద్దెకుంటున్న ఇంటివారి మూడో కుమార్తె కమలకు భర్త గతించాడు. ఆవార్త టెలిగ్రాం ద్వారా తెలిసిననాడు ఇంటి యజమాని సుబ్బరామయ్య, ఆయన భార్య వరలక్ష్మమ్మ గాఢదుఃఖంలో మునిగిపోవడం తెలుసుకొని వెంకట్రావు వాళ్ళని సూక్ష్మంగా పరామర్శింపడానికి కూడా యత్నించక మానందాల్చాడు. "ఎవరికర్మ నెవరు తప్పిస్తారు?" అన్న వాక్యం పరుల విషాదాన్ని గెలిచే ఉపశమనవచనం! ఆ వాక్యాన్ని ప్రయోగించడం వల్ల ఇక జవాబులేని నిశ్శబ్దం లభిస్తుంది. వేదాంతంలో వున్న గొప్ప మహత్త్వమే అది! మరల ప్రశ్నించడానికి వీలుకాని సమాధానాలు వేదాంతంలో బహుళంగా వున్నాయి. 'ఈప్రపంచమంతా మిధ్య' 'ఈ జగత్తు దేవుని మాయా ఖేలనం!" ఇత్యాది వేదాంత వాక్యాలకు సమాధానమే కనిపించదు. ఇతరుల కష్టాలకు ఆదుకోలేని వారి ప్రతారణమునకీ వాక్యాలప్పుడప్పుడు సాయపడగలవు. ఈ

వాక్యాలసత్యములు కావు కాని, సమస్యా పరిష్కారదోహదములు కాని ఉపశమన పూరితాలు.

భర్త గతించిన ఒక మాసానికి సుబ్బరామయ్య తన మూడో కుమార్తె కమలనీ, ఆమె ఏకైక పుత్రిక ఉషనీ తన యింటికి తీసుకవచ్చాడు. ఉష మూడేండ్లవయస్సుగల అల్లారుముద్దు బాలిక. ఇరువది మూడు వత్సరాల కమలకు కేశఖండన మవసరమని ఈనాటి పూర్వాచార పరాయణులు భావించక పోవడం వలన వారు కూడా కాలంతోపాటు మారినారనుటలో సందేహమేమీ లేదు. కమల సన్నగా, పొడుగుగా వున్న అన్నులమిన్న. పచ్చని శరీర కాంతికి సరివచ్చే చక్కని ముఖం, తిల నాసిక, నొక్కులు తీరిన వెంట్రుకలు; అతిమనోజ్ఞమగు రూపురేఖావిలాసములను మించినది ఆమె కోకిల కంఠము. కమల భర్త తాలూకు ఎనిమిదెకరముల మాగాని పొలమునకు హక్కుదారురాలయింది. అత్తవారి యింట్లో సగభాగమామెకు లభించినది. ఆమెకొక బావగారు మాత్రమున్నాడు. ఆయన ఆమె భర్తకు అన్న. చనిపోవుటకు ముందే, ఆమె భర్త తన భాగమును పంచుకొనినాడు.

వెంకట్రావు వున్న భాగం వీథి మీది కుంటంవల్ల, కమల పుట్టింటికి వచ్చిననాడు గుఱ్ఱపు బండిలోనుంచి దిగినప్పుడు వెంకట్రావు కిటికీలోనుంచి ఆమె సర్వాంగ సుందర విగ్రహాన్ని తిలకించాడు. యౌవనంలో భర్త గతించిన కమల ముఖంలో విన్నదనం అతని కన్నులకు కనిపించింది. అతనికి వెంటనే తన భార్య జ్ఞప్తికి వచ్చింది. తన ఏకాంత జీవితం మనసులో బరువుగా తోచింది. కాని అతను ఎంత అందగత్తెను చూచినా తత్క్షణం గతాన్ని స్మృతిలోకి తెచ్చుకోక తప్పడంలేదు. భార్యా వియోగంవల్ల అతను మనసులో నిరుత్సాహపడినా, బైటికి దీనంగా కన్పించేవాడు కాడు. మనసును లలిత కళలమీద కేంద్రీకరించడం అలవాటయి, అందాన్ని చూచి కన్నుల నిండయి పరమానంద భరితుడు కావడమే కాని ఏ స్త్రీ ప్రణయంకోసమూ అతను తీవ్ర ప్రయత్నం చేయడానికి సాహసించలేదు. ఇందుకు కారణం అతని మనఃప్రవృత్తి! ఎంతగా హృదంతరాన్ని శాంతిపరచుకొన్నా, కొందరి పట్ల అతని చిత్తస్థైర్యం సడలి, అతను రాత్రీపగలు చాలా మానసికావేదనపడి, వాంఛల పొందటానికి తగిన ధైర్య సాహసాలులేక, గౌరవ భంగమగునేమోనని జంకి స్త్రీకోసం వేదన పడడం అవివేకమని తలంచేవాడు. తన భూత కాలమే అతనికి గుణపాఠముగా తోచేది. తన ప్రణయం వంచింపబడినది మొదలు, అతని కితర స్త్రీలపై నమ్మకం సన్నగిల్లింది. పరస్త్రీ ప్రణయం ధైర్యవంతులకూ, గౌరవమును లెక్కచేయని పురుషులకూ, లభ్యమయేదే కాని తనవంటి పరికివాడికీ, శంకాహృదయుడికీ కాదని అతని కనుభవంమీద తెలిసింది. స్త్రీప్రణయం గోడమీది పిల్లివాటమని అతని నిశ్చితాభిప్రాయం. పైగా అతనికి రేగే ఊహలను మనసులో నిలుపుకొనే నిగ్రహం కూడా లేదు. ఏదేని వాంఛ హృదయంలో కలిగితే, అందువలన మనసుకలజడి హెచ్చుతుంది. ఆ అలజడిని సహించగల ఓర్పతనికి లేదు. అందుచే అతను పరస్త్రీ ప్రణయం కోసం వారాలు, నెలలు పరితపించి బాధపడి, విఫలుడై, శారీరకంగా, మానసికంగా కృంగిపోయి తానే వెనక్కు తగ్గేవాడు. అతను ప్రేమించిన అందగత్తెల్ని చూచి ఆనందించడమే మార్గాంతరమై, సంవత్సరాల తరబడి అలా చూస్తూనే ఉండిపోయిన ప్రేమయోగి. అతడితరులకు చాదస్తుడుగా కనిపిస్తాడు. ఎవరికి? ప్రణయ వ్యవహారాలలో రాటుదేలిన స్త్రీపురుషులకు. తన కనులముందే, ఎందరో పురుషులు తమ వాంఛల్ని సునాయాసంగా పొందుతూంటే అతను వారి అదృష్టాన్ని చూచి అసూయ చెందేవాడు. ఆశ్చర్యమగ్నమానసుడై తన దురదృష్టాన్ని తెలుసుకునేవాడు. తనలోని లోపాన్ని గ్రహించి మొత్తం స్త్రీ జాతినే ద్వేషించ సంకల్పించుకున్నాడు.

(ముగింపు వచ్చే సంచికలో)